# బంగారు లేడి

-సునీల్.జె



కావ్యకు అతడి చూపులు మొదట్లో చాలా ఇబ్బందిగా అనిపించేవి. ఆ చూపులు తనను ఆరాటంగా, తమకంగా తడుముతున్నట్టే ఉండేవి. అలా చూడొద్దని అతడికి చెప్పాలని చాలాసార్లు అనుకుంది. కానీ చెప్పలేకపోయింది. కారణం అతడు తన బాస్.

ఇంటి పరిస్థితుల దృష్ట్యా తప్పనిసరై ఉద్యోగంలో చేరాక ఇలాంటి చిన్న చిన్న ఇబ్బందులు తప్పవనుకుందామె. అలా అనుకోవడం వల్లనో, రోజూ అలవాటు కావడం వల్లనో తెలియదు అతడి చూపులు ఇప్పుడు అంతగా ఇబ్బంది కలిగించడం లేదు.

ఆరోజు కూడా శేఖర్ ఎప్పటిలాగే ఆమెను తినేసేవా చూస్తూ తన ఛాంబర్ వైపు వెళ్లాడు. మరో రెండునిముషాల తర్వాత ఫ్యూన్ వచ్చి ఆమె ముందు నిలబడి చెప్పాడు.

"మేడమ్! మిమ్మల్ని సార్ పిలుస్తున్నారు" అని.

కావ్య దీర్ఘంగా నిశ్వసించింది.

అవసరమున్నా లేకపోయినా అతడు అప్పుడప్పుడ తనను ఛాంబర్‌లోకి పిలవడం, "లంచ్‌కి వెళ్దామా, పార్కుకి వెళదామా?" అని అడగడం, తను మృదువుగా తిరస్కరించడం మామూలే.

'మరి ఇప్పుడు ఏం ప్రపోజ్ చేయబోతున్నాడో?' అనుకుంటూనే ఆమె ఛాంబర్ వైపు నడిచింది.

శేఖర్ ఆమెను చూసి నవ్వుతూ "హాయ్ కావ్యా!...కూర్చో" అన్నాడు.

"ఫర్వాలేదు. చెప్పండి సార్" అందామె.

"ఏం లేదు. మా మదర్‌కి గోల్డ్ కొంత తీసుకోవాలి. నేను జ్యూయెలరీ షాప్‌కి వెళ్తున్నాను. నాకు గోల్డ్ గురించి ఏమీ తెలియదు. జస్ట్! నువ్వూ నాతో వస్తే...?"

లంచ్‌కో, పార్క్‌కో అయినట్లయితే రానని ఖచ్చితంగా చెప్పేసి ఉండేది. జ్యూయెలరీ షాప్ అనేసరికి స్త్రీ సహజమైన మనసు లాగింది.

"...ప్లీజ్" అన్నాడు అతడు.

'అతడు పిలిచిన ప్రతిసారీ తాను రిజెక్ట్ చేస్తోంది. పోనీ ఈ ఒక్కసారికి వెళ్లి వచ్చేస్తే ఏమవుతుంది. అదీ బంగారం కొనడానికేగా..." మనసులోనే అనుకుంది. అందుకే నిలువుగా తలూపింది.

★ ★ ★

ఆఫీసు వదిలాక ఇద్దరూ ఓ జ్యూవెలరీ షాప్‌కి వెళ్లారు.

అతడు తన తల్లికి గోల్డ్ ఆర్డర్ ఇవ్వడంతో పాటూ కావ్య వద్దంటున్నా ఆమెకూ ఓ గోల్డ్‌రింగ్ కొన్నాడు.

తన చేతికి అతడు పెట్టిన బంగారు ఉంగరం చూసుకుని ఆమె మురిసిపోయింది.

"బైది బై... ఎలాగూ ఇంతదూరం వచ్చారు. పక్క వీధిలోనే మా ఇల్లు. మా ఇల్లు చూద్దురు రండి" అని అతడు ఆహ్వానిస్తే ఆ మూడ్‌లో కాదనలేకపోయింది.

ఇద్దరూ కారులో ఇల్లు చేరుకున్నారు.

చిత్రంగా అతడు ఇంట్లో ఎవ్వరూ లేకపోవడం చూసి ఆమె ఆశ్చర్యపోతుంటే చెప్పాడు.

"సారీ... మా ఫ్యామిలీ మెంబర్స్ ఏదో పెళ్లికి వెళ్లారు. రేపొస్తారు"

అతడే ఆమెకు సర్వీస్ చేసి అవీ ఇవీ అందిస్తూ చప్పున తన చెయ్యి పట్టుకున్నాడు.

"ప్లీజ్ కావ్యా! నువ్వు నాకు కావాలి. నువ్వంటే నాకు చాలా ఇష్టం..." అంటుంటే ఆమె మొదట అభ్యంతరం చెప్పింది. కానీ వయసు వేడి కావచ్చు. అతడు అందించిన గోల్డ్‌రింగ్ బహుమతి కారణం కావచ్చు. మెల్లగా అతడికి లొంగిపోయింది.

అతడి కోరిక తీరింది.

ఆమె ఇంటికి చేరుకుంది.

టీవీలో ఏదో పౌరాణిక సినిమా వస్తోంది. రాముడిని సీత బంగారులేడి కావాలని కోరుతోంది.

ఆ దృశ్యం చూసి కావ్య మనసులోనే అనుకుంది. 'అనాదిగా ఆడదానికి బంగారు మీద మోజు వున్నట్టుంది. ఆనాడు బంగారులేడి మీద మోజు పడ్డ సీత లంకకు చేరి రావణుడి చెరలో ఉండిపోయింది. ఈనాడు బంగారం పేరు చెప్పి వెంట తీసుకెళ్లిన ఈ శేఖర్ బంగారం బహుమతితో నా శీలాన్నే దోచారు'

★